క్లుప్తంగా

కొనసాగుతున్న ఆర్కే రోజా వితరణ



పుత్తూరులో పౌష్టికాహారం అందుకున్న గర్భిణులు

పుత్తూరు: స్థానిక వైద్య విధాన పరిషత్ ఆస్పత్రిలో బుధవారం పరీక్షల నిమిత్తం వచ్చిన గర్భిణులకు 'రోజా చారిటబుల్ ట్రస్ట్' ఆధ్వ ర్యంలో పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. పరీక్షల నిమిత్తం వేచి వుండే సమయంలో గర్భిణులు భోజనానికి ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో మాజీ మంత్రి ఆర్కే రోజా పుత్తూరు, న గరి ప్రభుత్వ ఆస్పత్రుల్లో పౌష్టికాహార పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం పుత్తూరు ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం వచ్చిన గర్భిణులకు, వారి సహాయకులకు యథావిధిగా పౌష్టికాహారాన్ని అందజేశారు. వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

పెనుమూరు ఎంపీడీఓగా నీలకంఠేశ్వర్‌రెడ్డి



పెనుమూరు(కార్వేటినగరం): మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా నీలకంఠేశ్వర్ రెడ్డి బుధవారం బాధ్యతలను చేపట్టారు. వెంకటగిరి ఎంపీడీఓగా బదిలీపై వెళ్లారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మళ్లీ పెనుమూరులో బాధ్యతలను చేపట్టారు.

మొబైల్ సైన్స్ వ్యాన్‌తో అవగాహన

పుత్తూరు: వడమాలపేటలోని విద్యార్థులకు బుధవారం మొబైల్ సైన్స్ వ్యాన్ ద్వారా జన్యువుల నమూనాలు, వంశపారంపర్య వ్యాధుల నివారణ, మేనరికం వివాహాల వల్ల కలిగేనష్టాలపై అవగాహన కల్పించారు. వడమాలపేట జెడ్పీ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన మొబైల్ సైన్స్ వ్యాన్‌ను ఎంఈఓలు పద్మావతి, తులసీరామ్ ప్రారంభించారు. వంశపారంపర్యకు జన్యువులే మూలమని, లింగ నిర్ధారణలో తండ్రి పాత్ర కీలకమని తెలిపారు. జన్యుపరమైన పలు సందేహాలను నివృత్తి చేశారు. హెచ్ఎం కరుణా నవనీతం పాల్గొన్నారు.

మండల మీట్ వాయిదా

పాలసముద్రం : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం జరుగనున్న సాధారణ సర్వసభ సమావేశం కోరం లేదని వాయిదా పడిందని ఎంపీడీఓ రామనాథరెడ్డి తెలిపారు. బుధవారం ఎంపీపీ శ్యామల అధ్యక్షతన మండల మీట్ జరగాల్సి ఉండగా, 10 గంటలైనా ఒక్క ఎంపీటీసీ సభ్యుడు మాత్రమే హాజరయ్యారని చెప్పారు. సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించడానికి కోరం లేదని గుర్తించి అధ్యక్షుడు 10 నిమిషాల పాటు వేచి ఉండాలని సభకు తెలిపారు. అయినా కూడా ఎంపీటీసీ సభ్యులు కోరం మేరకు హాజరు కానందున మొదటి బెల్ వేశారు. ఆ తరువాత 15 నిమిషాలకు రెండో వేయడం జరిగిందన్నారు. 30 నిమిషాలు పాటే వేచి ఉండి కోరం లేకపోవడం వల్ల మూడవ బెల్ వేస్తూ సభను వాయిదా వేశారు. తదుపరి విషయం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించి నిబంధనల ప్రకారం త్వరలో మరో తేదీలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తానని తెలిపారు.

ఉరుములు, మెరుపులతో భారీ వర్షం



జీఎన్ కండ్రిగ మార్గంలో కల్వర్టు వద్ద రోడ్డుపై పారుతున్న నీరు

నగరి: ఉదయం నుంచి మండే ఎండ, అకస్మాత్తుగా ఎండలోనే ప్రారంభమైన వర్షం.. ఆపై మెరుపులు, ఉరుములతో భారీ వర్షం అంటూ వినూత్న వాతావరణ పరిస్థితులు బుధవారం కనిపించాయి. వర్షం ఏకధాటిగా కురవడంతో లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలువలు నిండి నివాసాలపైకి మురుగునీరు ప్రవహించింది. పంటపొలాల్లో వర్షపునీరు నిండింది. కల్వర్టులున్న ప్రాంతాల్లో నీరు రోడ్డుపైకి ప్రవహించింది. ఖాళీ స్థలాలన్నీ వర్షపునీటితో దర్శనమిచ్చాయి.

గ్రామాభివృద్ధిపై శిక్షణ

విజయపురం: మండల కేంద్రంలో ఈనెల 16 నుంచి 18 వరకు గ్రామీణాభివృద్ధి ప్రణాళికపై శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ చంద్రమౌళి బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు తప్పక హాజరు కావాలని ఆయన తెలిపారు.

సర్పంచుల చేతుల్లోనే గ్రామాల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎంపీపీ శ్యామల

పాలసముద్రం : గ్రామాలు అభివృద్ధి చెందాలంటే ఆయా సర్పంచులే కీలకమని ఎంపీపీ శ్యామల తెలిపారు. బుధవారం ఎంపీడీ కార్యాలయంలో మండల పరిధిలోని సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులతో ఆమె సమీక్ష నిర్వహించారు. సర్పంచ్‌లు అయ్యప్ప, భాస్కర్‌రెడ్డి, లిల్లీ, అనురేఖ, శిఖ, జీవిత, నరసింహరాజు పాల్గొన్నారు.

అభివృద్ధికి సర్పంచ్‌లు కృషిచేయాలి

నింద్ర: మండలంలోని గ్రామ పంచాయతీ అభివృద్ధికి స్థానిక సర్పంచ్‌లు కృషి చేయాలని ఎంపీడీఓ అరుణ అన్నారు. బుధవారం మండలంలో సర్పంచ్‌లకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఆమె మట్లాడుతూ పంచాయతీల్లో ప్రజల సమస్యలు పరిష్కరించాలని అన్నారు.

మా పొలాలకు ఎలా వెళ్లాలి?

- నింద్ర మండలం అత్తూరు గ్రామస్తుల ఆవేదన
- రైతులకు సమస్యగా మారిన చిత్తూరు-తచ్చూరు జాతీయ రహదారి
- 800 ఎకరాల భూమికి దారి లేకుండా చేశారంటూ ఆగ్రహం
- వరద కాలువను కుదించేశారు.. శ్మశానానికి దారి లేకుండా చేశారు
- సర్వీసు రోడ్డు ఏర్పాటుచేయాలంటున్న రైతులు
- సమస్య పరిష్కారం కాకుంటే గోడలు కట్టే పనులు ఆపేస్తామంటూ హెచ్చరిక





భూముల నుంచి జాతీయ రహదారిపైకి వెళ్లకుండా గోడ కడుతున్న జాతీయ రహదారి సిబ్బంది, (ఇన్‌సెట్) దారి లేని అండర్‌బ్రిడ్జి

నగరి: చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి నింద్ర మండలం అత్తూరు గ్రామంలోని రైతుల పాలిట గుదిబండలా మారింది. పొలాలు, వరదనీటి కాలువపైగా వచ్చిన జాతీయ రహదారి అప్పటి వరకు తమ పొలాలకు వెళ్లడానికి ఉన్న సదుపాయాలను దూరం చేసింది. ముందస్తుగా తమకు సమస్య ఉందని గ్రామసభ ద్వారా గ్రామస్తులు విన్నవించుకోగా ఎలాంటి సమస్య రాకుండా చూసుకుంటామని హామీ ఇచ్చిన వర్క్ మేనేజర్లు వారి పనులు పూర్తికాగానే కనుమరుగయ్యారు. ఫోన్లలో సైతం వారు అందుబాటులోకి రావడం లేదు. దీంతో రైతులు ఆగ్రహానికి లోనయ్యారు. తమ సమస్య పరిష్కరించకుంటే ప్రస్తుతం రోడ్డుపక్కనే కడుతున్న గోడ పనులను ఆపేస్తామంటూ హెచ్చరిస్తున్నారు. చిత్తూరు–తచ్చూరు జాతీయ రహదారి నగరి తమిళనాడు పళ్లిపట్టు నుంచి సరిహద్దులోని నగరి మండలానికి చెందిన నత్తంకండ్రిగ, వీకేఆర్ పురం, దామరపాకం, విజయపురం, నింద్ర, పిచ్చాటూరు మండలాల మీదుగా మళ్లీ తమిళనాడులోకి ప్రవేశిస్తుంది. ప్యాకేజీ 2 పనుల్లో భాగంగా తమిళనాడు కుమారరాజ పేట నుంచి నగరి మండలం వీరకావేరిరాజపురం వరకు 17.58 కిలోమీటర్లు, ప్యాకేజీ 3 పనుల్లో భాగంగా వీరకావేరిరాజపురం నుంచి పొందువాక్కం వరకు 34.66 కిలోమీటర్లు ఈ రోడ్డు పనులు జరుగుతుంది. నింద్ర మండలం అత్తూరు మీదుగా రోడ్డు వెళ్లే సమయంలో రహదారిని ఆనుకొని పొలాలున్న రైతులు, ప్రభుత్వం భూములు కేటాయించిన ఎస్సీ, ఎస్టీలు తమ పొలాలకు దారి సమస్య ఎదురవుతుందంటూ గ్రామసభ ద్వారా జాతీయ రహదారి అధికారుల దృష్టికి తెచ్చారు. అలాంటి సమస్య లేకుండా చేస్తామని పొలాలకు వెళ్లడానికి దారి వసతి కల్పిస్తామని చెప్పిన అధికారులు పనులు పూర్తికాగానే మొఖం చాటేశారు. వారు నిర్మించిన అండర్ బ్రిడ్జి సైతం వంకలో నిర్మించడంతో రాకపోకలకు సదుపాయాలు కల్పించక వదిలేశారని రైతులు అంటున్నారు. అది మొత్తం బురదతో నిండి ఉండడంతో అందులో వెళ్లలేని పరిస్థితి నెలకొందంటున్నారు. 70 ఎకరాల భూమికి ఒకవైపు వంక, మరోవైపు జాతీయ రహదారి, ఇంకోవైపు కళియంబాకం హరిజనవాడ వస్తాయని ఈ పొలాల రైతులు తాము పండించే పంటలు మార్కెట్‌కు ఎలా తరలించాలని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకు ఉన్న సర్వీసు రోడ్డులోను పొలాలు కలిగిన రైతులు హద్దుల వరకు గోడలు కట్టుకుంటుండడంతో ఆ దారి కాస్త మూసుకుపోయిందని పశువులు అడవికి పోవాలన్నా దారి లేని పరిస్థితి నెలకొందని, శ్మశానానికి వెళ్లడానికి దారి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రహదారి నిర్మాణంలో నంబర్ 77/100 వద్ద వరద కాలువ ఉండడాన్ని జాతీయ రహదారి అధికారులు మరిచిపోయారని ఆపై ప్లాన్‌లో మార్పులు, అనుమతులు అలసత్వంతో కూడుకున్న పనికావడంతో అధికారులు వరద కాలువ వెడల్పును కుదించేశారని రైతులు తెలుపుతున్నారు. ఇరిగేషన్ అధికారులను కూడా వారు సంప్రదించలేదన్నారు. ఈ అంశంపై గ్రీన్ ట్రిబ్యునల్‌ను, జిల్లా కలెక్టర్‌ను సంప్రదించామని వారు కూడా సమస్య పరిష్కరించాలని ఆదేశించారని అయినా జాతీయ రహదారి అధికారులు వాటిని పెడచెవిన పెట్టారని రైతులు అంటున్నారు. సర్వీసు రోడ్డు ఏర్పాటుచేయకుంటే ప్రస్తుతం జరిగే రోడ్డుపనులు ఆపేస్తామంటూ వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

రైతుల సమస్యలను పరిష్కరించాలి..



జాతీయ రహదారి కారణంగా రైతులు ఎదుర్కొంటున్న సమస్యను అధికారులు పరిష్కరించాలి. 800 ఎకరాల భూములకు దారి లేకుండా చేశారు. సర్వీసురోడ్డు ఏర్పా టుచేయలేదు. పండించిన పంటలు రైతులు మార్కెట్‌కు ఎలా తరలించాలి. ఈ విషయమై గ్రీన్ ట్రిబ్యునల్‌ను సంప్రదించాం. సమస్య పరిష్కరించాలని కలెక్టర్ సూచించినా జాతీయ రహదారి అధికారులు స్పందించడం లేదు. సర్వీసు రోడ్డు వేయకుంటే పనులు ఆపేస్తాం.

– దొరబాబు, రైతు, అత్తూరు.

అధికారులు రైతులను ఏమార్చారు..



రోడ్డు వేసే సమయంలో సమస్యను పరిష్కరిస్తామన్న రైతులు రోడ్డు పనులు పూర్తి కాగానే ముఖం చాటేశారు. ఫోన్లు చేసినా స్పందించడం లేదు. మా పనైంది ఇక మీతో ఏం పని అన్న చందాన వ్యవహరిస్తున్నారు. అండర్ బ్రిడ్జి వంకలో నిర్మించారు. సర్వీసు రోడ్డు లేదు. ఇక మేము పొలాలకు ఎలా వెళ్లాలి. అధికారులే సమస్యను పరిష్కరించాలి.

– విశ్వనాథం, అత్తూరు

శ్మశానానికి దారి లేదు..



అత్తూరు శ్మశానానికి పక్కనే వరద కాలువ వుంది. ఆ పక్కనే జాతీయ రహదారి నిర్మించారు. ప్రస్తుతం శ్మశానానికి వెళ్లేందుకు దారి లేదు. రోడ్డు వేసే సమయంలో దారి కల్పిస్తామని చెప్పిన అధికారులు ఆ మాటను మరిచారు. దారి వసతి ఏర్పాటుచేయాలి.

– నాగేష్‌నాయుడు, అత్తూరు.

ప్రాజెక్టు డైరెక్టర్‌పైకి నెట్టేస్తున్నారు..



రోడ్డు వేసే సమయంలో వరద నీటి కాలువను కుదించేసిన అధికారులు, వాటి గురించి ప్రశ్నిస్తే వాటితో మాకు సంబంధం లేదని అది ప్రాజెక్టు డైరెక్టర్‌ను అడగాలంటూ ఉన్నతాధికారులపైకి నెట్టేస్తున్నారు. సమస్యను పరిష్కరించడానికి చొరవ చూపడం లేదు. మామిడి తోటలు కోతకు వచ్చాయి. రైతులు వాటిని ఎలా మార్కెట్‌కు తరలించాలి.

–మురళి, అత్తూరు.

14న జాతీయ లోక్‌అదాలత్



జడ్జి రాఘవేంద్ర

పుత్తూరు: స్థానిక సబ్‌కోర్టు ఆవరణలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు పుత్తూరు మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ సివిల్ జడ్జి ఎస్సీ రాఘవేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. న్యాయవాదులు, పోలీసులు అత్యధిక కేసుల పరిష్కారానికి కృషిచేయాలని చెప్పారు. ప్రధానంగా రాజీకి లోబడిన క్రిమినల్ కేసులు, అన్ని రకాల సివిల్ కేసులను రాజీ చేయాలని సూచించారు. కోర్టులో పెండింగ్‌లో లేని ఫ్రీ లిటిగేషన్ కేసులను సైతం లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవచ్చునని తెలిపారు. నగదుతో పాటు విలువైన కాలాన్ని సద్వినియోగం చేసుకోవడం తోపాటు మానసిక ఆందోళనలకు దూరం కావాలంటే రాజీ మార్గమే సురక్షితమైనదని కక్షిదారులకు అవగాహన కల్పించాలని కోరారు. దీంతో పెద్ద సంఖ్యలో కేసులు పరిష్కరించేలా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నింద్ర ఎంపీడీఓగా అరుణ



నింద్ర: మండల ఎంపీడీఓగా అరుణ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ భవాని నెల్లూరు జిల్లాకు బదిలీ కావడంతో గతంలో ఇక్కడే పనిచేసిన అరుణ పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఆమె మట్లాడుతూ మండల అభివృద్ధికి కృషిచేస్తామన్నారు.

విజయపురం ఎంపీడీఓగా చంద్రమౌళి



విజయపురం: విజయపురం ఎంపీడీఓగా చంద్రమౌళి బుధవారం తిరిగి బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కోసం నెల్లూరు జిల్లా సూళూరుపేటకు బదిలీపై వెళ్లారు. ఎన్నికల అనంతరం విజయపురం ఎంపీడీఓగా తిరిగి బాధ్యతలు చేపట్టారు.

మౌలిక వసతుల కల్పనకు కృషి చేయండి



మాట్లాడుతున్న ఎంపీపీ లత

కార్వేటినగరం: గ్రామాల్లో మౌలిక వసతుల కల్పించడంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు సమిష్టిగా కృషి చేయాలని ఎంపీపీ లత అన్నారు. బుధవారం ఎంపీడీఓ సమావేశ భవనంలో నిర్వహించిన రాష్ట్రీయ గ్రామ్ స్వరాజ్ అభియాన్ కార్యక్రమం ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంపీపీ లత మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి సర్పంచ్, కార్యదర్శుల మీదే ఆధారపడి ఉందన్నారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీపతి, ఈఓ పీఎస్ మణి, సర్పంచ్‌లు, అధికారులు పలువురు పాల్గొన్నారు.

గజరాజుపై ద్రౌపదీదేవి విహారం

పుత్తూరు: పట్టణంలో ద్రౌపదీదేవి సమేత ధర్మరాజులస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గజ వాహనంపై ద్రౌపదీదేవి విహరించారు. ఇంటింటి వద్ద భక్తులు అమ్మవారికి కర్పూరహారతులిచ్చారు. ఉదయం 6 గంటలకు బ్రహ్మోత్సవాల్లో భాగంగా అర్చకులు హేమాచలంబాబు ఆధ్వర్యంలో మంచినీళ్ల గుంట వద్ద నుంచి గెరిగ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొంది. గెరిగ జలాలతో స్వామి అమ్మవార్లకు అభిషేకం నిర్వహించి, పట్టుపీతాంబరాలు, స్వర్ణాభరణాలు, సుగంధ పుష్పాలతో అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. అనంతరం ఈశ్వరాపురం దళిత సంఘం ఆధ్వర్యంలో గాండీవ రాజసూయయాగం ఘట్టం నిర్వహించారు. రాత్రి 8 గంటలకు ద్రౌపదీ సమేత అర్జునుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి గజవాహనంపై కొలువుదీర్చారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గజవాహనం ఊరేగింపు నిర్వహించారు. ఇంటింట స్వామి అమ్మవార్లకు నారికేళ్ల కర్పూర నీరాజనాలు సమర్పించారు.



గెరిగకు పాదపూజ చేస్తున్న మహిళలు

16 నుంచి శిక్షణ

శ్రీరంగరాజపురం: రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మూడు రోజుల పాటు శిక్షణా తరగతులు నిర్వహిస్తామని ఎంపీడీఓ మోహన్‌మురళి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 23 పంచాయతీ సర్పంచులు, ఈ నెల 16వ తేదీ నుంచి 18 వరకు మండల కార్యాలయంలో నిర్వహించే శిక్షణకు ప్రతి సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తప్పక హాజరు కావాలన్నారు. ఈ శిక్షణలో ముఖ్యంగా శానిటేషన్, సాలిడ్‌వేస్ట్ మేనేజ్మెంట్, గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, వీధి దీపాలకు సంబంధించి శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు.

సంఘాలతో ఆర్థికాభివృద్ధి సాధ్యం

పుత్తూరు: మహిళా సంఘాల ద్వారా ఆర్థికాభివృద్ధి సాధించవచ్చునని రాస్ డైరెక్టర్ నాగరాజు అన్నారు. బుధవారం స్థానిక రాష్ట్రీయ సేవా సమితి (రాస్) కార్యాలయంలో టైలరింగ్, ఆర్యా వర్స్ శిక్షణ పొందుతున్న మహిళలకు టైలరింగ్ మిషన్లను ఆయన పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ చేతి వృత్తుల్లో శిక్షణతో పాటు రుణాలను పొందుతున్న మహిళలు ఆ సొమ్మును ఆర్థిక కార్యక్రమాలపై వెచ్చించాలని సూచించారు. అప్పుడే ఆర్థికాభివృద్ధి సాధించాడానికి సాధ్యపడుతుందని వివరించారు. రాస్ జన్ శిక్షణ్ సంస్థాన్ ఆధ్వర్యంలో 84 రోజుల పాటు ఆర్యా వర్స్‌పై శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. అలాగే రాస్ సంస్థ ఆధ్వర్యంలో పుత్తూరు పరిసర ప్రాంతాల్లో ఉచిత వైద్యశిబిరాలను నిర్వహిస్తున్నారని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



ఆర్యా వర్క్‌పై సూచనలిస్తున్న రాస్ డైరెక్టర్ నాగరాజు

రాస్ అధికారులు రవి, ప్రకాష్, దివాకర్, జయంతి పాల్గొన్నారు.

దేశభక్తి పెంపొందేలా హర్ ఘర్ తిరంగా



జాతీయజెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



భగవతిని సన్మానిస్తున్న ప్రిన్సిపల్ విజయులురెడ్డి

కార్వేటినగరం: హర్ ఘర్ తిరంగా ప్రతి పౌరుడిలో దేశభక్తిని పెంపొందిస్తోందని తహసీల్దార్ భగవతి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ ధనుంజయరెడ్డి విద్యార్థులచే ప్రమాణం చేయించారు. ఈ క్రమంలో భాగంగా విద్యార్థులు త్రివర్ణ పతాకాలతో ర్యాలీ చేపట్టారు. అనంతరం తహసీల్దార్ భగవతిని శాలువలు కప్పి పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ విజయులురెడ్డి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ బాలసుబ్రమణ్యం ఆచారి, అధ్యాపకులు డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ హరిబాబు, కార్తీక్, భార్గవి, వ్యాయామ ఉపాధ్యాయుడు జోగి ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీహరిపురంలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు గ్రామంలో బుధవారం జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఇంటింటిపై, జాతీయ జెండా ఎగరేయాలని హెచ్ఎం జ్ఞానప్రసాద్ పేర్కొన్నారు. ఉపాధ్యాయులు విజయకుమార్, వెంకమరాజు, లక్ష్మీపతి, పంచాయతీ సిబ్బంది శ్రీనివాసులు పాల్గొన్నారు

జాతీయ జెండాను గౌరవిద్దాం

కార్వేటినగరం: మండలకేంద్రంలో పంచాయతీ కార్యాలయం నుంచి బ్రాహ్మణ వీధి, మండపం వీధి, బజారు వీధి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు గురువారం విద్యార్థులతో పాటు అధికారులు, ఉపాధ్యాయులు కలసి హర్ ఘర్ తిరంగాలో భాగంగా 125 మీటర్ల జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ లక్ష్మీపతి ఆధ్వర్యంలో ర్యాలీని ప్రారంభించారు. ఈ క్రమంలో భాగంగా జాతీయ నాయకుల వేషధారణలో ఉన్న విద్యార్థులను ఎంపీపీ లత అభినందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, ఎంఈఓలు విజయకుమార్, మనోజ్‌కుమార్, సర్పంచ్ ధనుంజయ వర్మ, ఉపాధ్యాయులు, కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. మండలంలోని డీఎం పురం, ఇందిరా కాలనీలోని పాఠశాలలో కూడా హర్ ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహించారు.



జాతీయ నాయకుల వేషధారణలో ఉన్న విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ లత



బలిజకండ్రిగ హైస్కూల్‌లో ..

స్వాతంత్ర్య ఫలాలు అందరికీ అందాలి

శ్రీరంగరాజపురం : మండలంలోని హర్ ఘర్ తిరంగా సంబరాలు అంబరాన్నంటాయి. శ్రీరంగరాజపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంఈఓ అరుణాచలంరెడ్డి ఆధ్వర్యంలో పుల్లూరు క్రాస్ రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ రాజాకుళ్లాయప్ప, తహసీల్దార్ అమర్‌నాథ్, ఎంపీడీఓ మురళీమోహన్, ఏపీఎం రోజా, ఏపీఓ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పాలసముద్రంలో..

పాలసముద్రం : మండలకేంద్రంలోని హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు మీనాక్షి బుధవారం ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలసి హర్ ఘర్ తిరంగా అంటూ ప్రచార ర్యాలీని నిర్వహించారు.